

కాలుష్యరహిత జిల్లాగా కడప



కడపను పరిశుభ్రంగా ఉంచుతాం-కాలువల్లో వ్యర్థాలు వేయమంటూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్



కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధనలో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాను కాలుష్య రహితంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవితో కలిసి కలెక్టర్ ఈ-చెక్ (ఎలక్ర్టానిక్ వ్యర్థాల సేకరణ) కార్యక్రమాన్ని కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించారు. జేసీ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు.

కడప ఏడురోడ్ల సర్కిల్ నుంచి స్వచ్ఛత ర్యాలీని కలెక్టర్, ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. వన్‌టౌన్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ దివస్ సందర్భంగా ఈ-చెక్ థీమ్‌తో ఎలక్ర్టానిక్ పరికరాల

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వ్యర్థాల సేకరణ జరుగుతోందన్నారు. ఆ మేరకు స్వచ్ఛత వైపు ఒక ముందడుగు వేద్దామన్నారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ అంశానికి సంబంధించి ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఇంట్లో ఎలక్ర్టానిక్ వస్తువులు వాడుతూనే ఉంటారని, వాటి వ్యర్థాలను మన నివాస ప్రదేశాల్లో ఉంచుకోవడం ప్రమాదకరమన్నారు. మన పరిసరాలను అవి విషపూరితం చేస్తాయని తెలిపారు. ప్రతి పౌరుడు మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్రగా పాటించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో పాలుపంచుకోవాలన్నారు. ప్రతి ఇల్లు, ప్రతి కార్యాలయం, ప్రతి వాణిజ్య సముదాయంలో ఎలక్ర్టానిక్ వర్థాలను సేకరిస్తామన్నారు. ఈ-వేస్ట్ ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఉంటుందని, దాని పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారాన్ని స్వచ్ఛాంధ్ర దివస్‌గా నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అది కూడా మన జిల్లా నుంచే మూడు నెలల క్రితం అమలు కావడం శుభపరిణామమన్నారు. ఎప్పటికప్పుడు ఎలక్ర్టానిక్ వ్యర్థాలను తొలగించడం ద్వారా మన ఇంట్లో స్థలం కలిసి రావడంతో పాటు, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు.



ఎలక్ర్టానిక్ వ్యర్థాలపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్, ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు

ఈ కార్యక్రమానికి వచ్చిన వారందరితో ప్రతి మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర దివస్ పాటిస్తామంటూ కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీపీఓ రాజ్యలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య ప్రజారోగ్య శాఖల అధికారులు, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళ సంఘాల సభ్యులు, గ్రీన్ అంబాసిడర్లు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రూ.1.39 కోట్ల పంటనష్టం



వేముల మండలంలోని వేల్పుల గ్రామంలో వర్షానికి నేలవాలిన అరటి పంట

కడప రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటుచేసుకున్న ఆధిక పీడనం కారణంగా శుక్రవారం కురిసిన ఆకాల వర్షంతో జిల్లాలోని 9 మండలాల్లో రూ.1.39 కోట్ల పంటనష్టం వాటిల్లింది. 464 మంది రైతులకు సంబంధించి 412.62 హెక్టార్లలో పలు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో అరటి, బొప్పాయి, పుచ్చకాయ, మిర్చి, పులుసునిమ్మ, మునగ తదితర పంటలు ఉన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వేముల, లింగాల మండలాల్లోనే 306 హెక్టార్లలో పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఒంటిమిట్ట, దువ్వూరు, చక్రాయపేట, వేంపల్లె, సింహాద్రిపురం, సిద్దవటం, మూద్దనూరు మండలాల్లోనూ పంటలు దెబ్బతిన్నాయి.

జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారిగా హిదయతుల్లా



కడప కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప ఉమ్మడి జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారిగా షేక్ హిదయతుల్లా శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనారిటీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులైన వారందరికీ చేరేలా పనిచేస్తానని అన్నారు. విద్యార్థులకు విద్యావేతనాలు, ఉపకార వేతనాలు అందేలా చేయడంతో పాటు, వృత్తిపరమైన శిక్షణ, మైనార్టీ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో.. నారాయణ విద్యార్థుల హవా



విద్యార్థులను అభినందిస్తున్న కోర్ డీన్ చంద్రకిశోర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): శనివారం విడుదలైన జేఈఈ-మెయిన్స్-2025 ఫలితాలలో కడప నారాయణ కళాశాల విద్యార్థుల హవా కొనసాగిందని ఆ విద్యాసంస్థల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆలిండియా ర్యాంకుల్లో అబ్దుల్ హసీమ్ 1417వ ర్యాంకు, రామ్‌శరణ్ 2082, జగత్ స్మరణ్‌రెడ్డి 2336, ఆదిత్యవర్ధన్‌రెడ్డి 2550, ధనుష్ 3523, సుధీర్‌కుమార్‌రెడ్డి 6095, ధీరజ్‌కుమార్‌రెడ్డి 8179, శ్రీలేఖ-11049, సుజన 14426, నితిన్‌రెడ్డి 17071, ఉమర్ 18435, మహమ్మద్‌హసాన్ 20032, దీపక్ 24658, మహమ్మద్ అజాన్ 25763 ర్యాంకులు సాధించారన్నారు. 200మందికి పైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించారన్నారు. విద్యార్థులు తమ పట్టుదలతోను, తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో ఈ ఘనవిజయం సాధించారని చెప్పారు. విద్యార్థులను డీజీఎం రామమోహన్‌రెడ్డి, కోర్‌డీన్ చంద్ర కిశోర్‌రెడ్డి, డీన్స్ సుబ్బారావు, బాలవెంకటరెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సి పాల్స్ మురళీమోహన్, వెంకటస్వామి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, రాఘవరెడ్డి, సుమన్ అభినందించారు.

ఓబీసీ విభాగంలో 5వ ర్యాంకు



మునిసాయియాదవ్

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ కుమారుడు కె.మునిసాయియాదవ్ 99.999 పర్సంటైల్‌తో ఓబీసీ విభాగంలో జాతీయస్థాయిలో 5వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 43వ ర్యాంకు సాధించాడని ప్రొద్దుటూరుకు చెందిన మునెయ్య యాదవ్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు, సన్నిహితులు అభినందించారు.

శ్రీచైతన్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కడప ఎడ్యుకేషన్, ఏపిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాలలో కడప శ్రీచైతన్య కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. ఆలిండియా అన్ని కేటగిరీలలో టి.గౌతమ్ 321, ఇ.జస్వంతి 458, ఎం.గురుసూర్య 818, బి.అన్విత్ 1214, కె.సతీశ్ 1968, కె.శివరామ్‌నాయక్ 6094 ర్యాంకులతో పాటు 52 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్ష రాయడానికి అర్హత సాధించారని కళాశాల యాజమాన్యం తెలిపింది. పోటీ పరీక్షలలో టాప్ ర్యాంకుల సాధనే ధ్యేయంగా కృషిచేస్తూ ఆలిండియా పరీక్షల సాధనలో కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో శ్రీచైతన్య విద్యాసంస్థ విశిష్ట ప్రణాళిక, ఉత్తమ మెటీరియల్స్ అధ్యాపకుల నిరంతరకృషి, ప్రోత్సాహమే కారణమని శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు సుష్మశ్రీ, నాగేంద్ర కుమార్ తెలిపారు. శ్రీచైతన్య తిరుపతి డివిజన్ ఏజీఎం బీవీ ప్రసాద్, డీఎన్ కేఎల్‌జీ ప్రసాద్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రవీణ్, నాగరాజు, అడ్మిన్ ఆఫీసర్ మనోజ్, మల్లికార్జునస్వామి, నాగిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ అభినందించారు.

ప్రకృతి సాగు.. పసుపు బాగు

● ఎకరాకు 20.4 టన్నుల దిగుబడి

● కొనుగోలు చేసేందుకు

తరలివస్తున్న దూరప్రాంతాల రైతులు

7



అధిక దిగుబడి వచ్చిన మైదుకూరు రకం పసుపు

యువకుడి ఆత్మహత్యాయత్నం

● దళితులకు ఇచ్చిన స్థలాలు ఆక్రమించారంటూ ఆవేదన

7



ఒంటిపై కిరోసిన్ పోసుకున్న యువకుడు

వక్ఫ్ చట్టం ప్రమాదకరం

● ప్రొద్దుటూరు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ చట్టం ముస్లింల ఉనికికి ప్రమాదకరంగా మారిందని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు కేఎం అబ్దుల్‌సుబహాన్ పేర్కొన్నారు. వక్ఫ్ చట్టాలకు నిరసనగా శనివారం ప్రొద్దుటూరు జేఏసీ ఆధ్వర్యంలో ముస్లింలు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. శివాలయం సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వక్ఫ్‌బోర్డుకు 8 లక్షల ఎకరాల భూమి ఉండగా అందులో సగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కబ్జా చేశాయని మిగిలిన భూమిలో మసీదులు, మదరసాలు, ఖబరస్తాన్‌లు ఉన్నాయన్నారు. 400 సంవత్సరాలుగా హిందు ముస్లిం రాజులు అన్ని వర్గాల ప్రజలకు భూములు, స్థలాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఆ భూములకు నేడు డాక్యుమెంట్లు చూపాలనడం దారుణమన్నారు. వక్ఫ్‌బోర్డులో అభివృద్ధి లేదంటున్న ప్రభుత్వం ప్రభుత్వ శాఖలలో ఏమి అభివృద్ధి జరిగిందో చెప్పాలన్నారు. ప్రజలకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాగా ముస్లిం ప్రజలకు వక్ఫ్‌బోర్డు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం కోరడం తగదన్నారు. ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు మద్దతుతోనే వక్ఫ్ చట్టం కార్యరూపం దాల్చిందని, దీనిపై వారు పునరాలోచించుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య, ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి షేక్ సలీం మాట్లాడారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు సాయినాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఖాజా, కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పీఎండీ నజీర్, అహ్మద్‌షేక్, సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, విరసం వరలక్ష్మి, మత పెద్దలు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులోని శివాలయం సర్కిల్‌లో ముస్లింల శాంతియుత నిరసన

మరమ్మతులకు మోక్షమెప్పుడో...?

- మూడేళ్ల క్రితం తెగిన హంద్రీ-నీవా కాలువ
- రాకపోకలకు ఇబ్బందులు
- ఆయకట్టంతా బీడుగానే...
- ఈ ప్రభుత్వంపైనే ఆశలు


గండి పడిన హంద్రీ-నీవా కాలువ


బీడుగా మారిన ఆయకట్టు భూములు

పెద్దమండ్యం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలంలో గండ్లు పడిన చెరువులు, కాలువల అభివృద్ధి పనుల మరమ్మతులకు మోక్షమెప్పుడోనని రైతులు ఎదురుచూస్తున్నారు. భూగర్భ జలాలు పెంచే చెరువులు, హంద్రీ-నీవా కాలువలకు వర్షాకాలంలో గండ్లు పడ్డాయి. తూతూమంత్రంగా తాత్కాలిక మరమ్మతు పనులతో సరిపెట్టారే కానీ శాశ్వత పనులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ప్రజలు విమర్శస్తున్నారు. మూడేళ్లుగా మరమ్మతు వ్యవహారం గాలికి వదిలేశారు. అభివృద్ధి పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు రావడం లేదు. తద్వారా ఆ ప్రాంతాల రైతులు నష్టపోతున్నారు.

మూడేళ్ల క్రితం నివర్ తుపాన్ ధాటికి పెద్దమండ్యం పరిధి దొమ్మరపల్లి సమీపంలో హంద్రీ-నీవా కాలువకు గండి పడింది. దీంతో కాలువపై నిర్మించిన బ్రిడ్జి పక్కన ఉన్న గ్రామాలకు వెళ్లే దారి కూడా ధ్వంసమైంది. ఆయా గ్రామ ప్రజలు ఏడాదిగా దారి సమస్యతో ఇబ్బందులు పడ్డారు. దొమ్మరపల్లెలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు ప్రతిరోజూ అవస్థలు పడేవారు. దీంతో అధికారులు చర్యలు తీసుకుని గండి పడిన కాలువను తాత్కాలిక మట్టి పనులతో చేసి దారి ఏర్పాటు చేశారు. అది ఇప్పుడు మళ్లీ ధ్వంసం కావడంతో.. వర్షాకాలం ప్రారంభమైతే ఈ మార్గంలో మళ్లీ ప్రజలకు కష్టాలు తప్పవని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

గతంలో కురిసిన వర్షాలకు పలు చెరువులు, కాలువలకు గండ్లు పడ్డాయి. మండలంలోని పెద్దమండ్యం పరిధిలోని గెల్లంవారిపల్లెకు సమీపంలోని కుషావతి నదిపై నల్ల రాతిమడుగు ప్రాజెక్టు పనులు జరిగాయి. అక్కడ కుషావతినది నుంచి చెరువుకింద పల్లి లంజుకుంటచెరువు, పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణచెరువు, కుప్పాల కుంట కాలువలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం తుఫాన్ సమయంలో నది ఉధృతి పెద్దమండ్యం పాతచెరువు కాలువపై సాగడంతో మాసాబీబీ దర్గా సమీపంలో కాలువకు గండి పడింది. అప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక మట్టి పనులు చేయించారు. కానీ కాలువ లీకేజీలు ఆపలేకపోయారు. ఈ వర్షాకాలంలో కురిసిన వానలతో ఆ మూడు చెరువులకు వర్షపు నీటితో జలకళ నెలకొంది. రైతులు హర్షించినా ఆయకట్టు భూముల్లో పంటలు సాగుచేసేందుకు సిద్ధపడలేదు. తాత్కాలిక పనులు చేసిన కాలువలకు మళ్లీ గండ్లు పడతాయని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఆ మూడు చెరువుల కింద ఆయకట్టు భూములు బీడుగా మారాయి. కేవలం 100 మీటర్ల కాలువకు శాశ్వత అభివృద్ధి పనులు చేయడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శలు వచ్చాయి. గతంలో రబీలో వరి పంట చివరి దశలో పంటలకు నీరందకపోవడంతో ఎండిపోయాయి. దీంతో పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణచెరువు, కుప్పాల కుంట కింద ఆయకట్టు సుమారు 90 ఎకరాల్లో బీడుగా మారింది. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఈ వేసవిలో ఈ కాలువలో గండి పూడ్చి శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే దొమ్మరపల్లి సమీపంలోని హంద్రీ-నీవా కాలువకు గండి పడిన ప్రాంతంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


గండి పడిన సమయంలో విద్యార్థుల కష్టాలు (ఫైల్)

నిధులు వచ్చిన వెంటనే పనులు చేస్తాం

గండి పడిన చెరువులు, కాలువ మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాము. మండలంలో గండ్లు పడిన అభివృద్ధి పనుల కోసం రూ.6.5 కోట్ల నిధులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం. నిధులు మంజూరు చేసిన వెంటనే అభివృద్ధి పనులు చేపడతాం.

- శ్రీనివాసులురెడ్డి, ఇన్‌చార్జ్ ఏఈఈ ఇరిగేషన్ శాఖ, తంబళ్లపల్లి

ఎలక్ట్రానిక్ వ్యర్థాల తొలగింపుపై అవగాహన ఉండాలి

- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్


వ్యర్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వ్యర్థాల శాస్త్రీయ తొలగింపుపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వద్ద ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడం అనే కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్ శ్రీధర్ పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా నేడు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడం అనే థీమ్‌తో జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, పెద్ద పంచాయతీల్లో ప్రతిరోజూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ జరుగుతుందని, మిగిలిన పంచాయతీల్లో వారానికి ఒకసారి లేదా నెలకు ఒకసారి జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణపై ఎస్‌హెచ్ గ్రూపులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామని, వారి ద్వారా ప్రజల దగ్గర నుంచి ఈ-వ్యర్థాలను సేకరిస్తున్నామన్నారు. రాయచోటి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రంలో శనివారం 170 కిలోల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించబడ్డాయని తెలిపారు. వాటిని ప్రైవేటు కంపెనీలకు అందిస్తే వారు రీసైక్లింగ్ చేస్తారన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలను ఎదుర్కొనే పద్ధతులపై అవగాహన


మంటలను ఆర్పే విధానాన్ని చూపుతున్న దృశ్యం

పీలేరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే పద్ధతులు, ఉపయోగపడే సాధనాలు, పాటించాల్సిన చిట్కాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అనిల్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పీలేరు అగ్నిమాపక సిబ్బంది శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలు, వాటి నివారణ, ఎదుర్కొనే విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ అంతస్తుల భవనాలలో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎలా నివారించాలి, మంటల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. గ్యాస్, ఆయిల్, విద్యుత్ తీగల మంటలను ఆర్పే విధానాలను ప్రయోగాత్మకంగా డెమో రూపంలో ప్రదర్శించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే 101, 08584-244399, 9963736587 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు అగ్నిమాపక కేంద్రాధికారి మస్తాన్, సిబ్బంది నాగిరెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేశ్, రెడ్డిశేఖర్, మహబూబ్ బాషా, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

19పీఎల్ఆర్ వీఎల్‌కే2: వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రిలో అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రమాదాల సమయాన భయపడొద్దు..

వాల్మీకిపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు సంభవించినపుడు అప్రమత్తంగా ఉండటం ద్వారా బయట పడవచ్చునని వాల్మీకిపురం అగ్నిమాపక కేంద్ర అధికారి బాబయ్య తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, డాక్టర్లు సోని, శివాణి, ఆసిఫ్, జ్ఞానేశ్వర్, ఫైర్ మెన్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీలకు తాజా సర్టిఫికెట్లు పొందాలి

- డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలపై బదిలీ కోరే ఉపాధ్యాయులు వారి అనారోగ్యానికి సంబంధించిన తాజా సర్టిఫికెట్లను పొందాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వుల మేరకు ఈ ఏడాదిలో జరగబోయే ఉపాధ్యాయ బదిలీల్లో ప్రతిపాదిత మార్గదర్శకాలను అనుసరించాలన్నారు.

కడప రిమ్స్‌లో ఏర్పాటు చేసిన అదనపు డైరెక్టర్లు, వైద్య విద్యా సూపరింటెండెంట్‌లు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు (మూడు రోజుల వ్యవధిలో) ఆరోగ్య ధ్రువపత్రాలు జారీ చేస్తారని తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ధ్రువపత్రాలు పొందాలని తెలిపారు.

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. దీనిపై వివరణాత్మక మార్గదర్శకాలు త్వరలో జారీ చేస్తారన్నారు. ఆరోగ్య కారణాలపై బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు సంబంధిత జిల్లా వైద్య మండలి ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాయులు తిరుపతిలోని ఎస్వీఆర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి, ఉమ్మడి కడప జిల్లా ఉపాధ్యాయులు కడప రిమ్స్ ప్రభుత్వాసుపత్రి నుంచి తాజా వైద్య ధ్రువపత్రాలను పొందాలని తెలిపారు.

మహిళపై దాడి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పొలంలో రాళ్లు వేయడాన్ని అడ్డుకున్నందుకు ఓ మహిళపై దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె మండలం, మాలేపాడు పంచాయతీ కతోళ్లపల్లెకు చెందిన గుర్రప్ప భార్య గోపెమ్మ(40) శనివారం తన పొలంలో ఉండగా అదే గ్రామానికి చెందిన కదిరప్ప, సరసమ్మ, భాస్కర కర్రలు, రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. కుటుంబసభ్యులు ఆమెను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యాయామ అధ్యాపకుల పోస్టుల రద్దు.. వద్దు!

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులు రద్దు చేయ రాదంటూ మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వ్యాయామ అధ్యాపకులు శనివారం ఆ కళాశాల ఇన్‌చారి ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీలు మురళీ, నరేష్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లోని జూనియర్ లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులను రద్దు చేయడం బాధాకరం అన్నారు. ఈ విషయంపై ఇంటర్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు, విద్యా శాఖమంత్రి నారాలోకేశ్‌కు విన్నవించాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలోదేవకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌కు కలాం కార్మిక రత్న అవార్డు


అవార్డును అందుకుంటున్న కండక్టర్ సీఎస్ మణ్యం

రాజంపేట టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కండక్టర్ సీఎస్ మణ్యంకు ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ తరఫున కలాం కార్మిక రత్న అవార్డును శుక్రవారం అందజేశారు. రాజంపేట ఆర్టీసీ డిపోలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న మణ్యంకు తమిళనాడు రాష్ట్రం మదురైలోని జేపీ ఇండోర్‌స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ జాతీయ సదస్సులో అవార్డును అందజేశారు. ఆయన సేవలకు గాను ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు.

ప్రాజెక్టుల రూపకల్పనలో నైపుణ్యం సాధించాలి

కలకడ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సైన్స్ ప్రాజెక్టుల రూపకల్పనలో నైపుణ్యం సాధించాలని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. కలకడ ఆదర్శ పాఠశాల్లో శనివారం ప్రారంభమైన అటల్ బూత్ క్యాంప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిద్ధాంతం, అభ్యాసం మధ్య అంతరం తగ్గడానికి ఇలాంటి శిక్షణ దోహదపడుతుందన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత, అన్వేషణాత్మక, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మలాంషా వలి మాట్లాడారు. ఎంఈవో మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తప్పులను కప్పిపుచ్చుకోవడానికే రైతులపై కేసులు

- జనసేన కో ఆర్డినేటర్ రాందాస్‌చౌదరి


ఆందోళన చేస్తున్న రైతులకు సంఘీభావం తెలుపుతున్న జనసేన నాయకుడు రాందాస్‌చౌదరి, సీపీఎం శ్రీనివాసులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చిరుత మృతి ఘటనలో అటవీశాఖ అధికారులు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే రైతులపై కేసులు నమదు చేశారని జనసేన రాయలసీమ కోఆర్డినేటర్ గంగారపు రాందాస్‌చౌదరి మండిపడ్డారు. శనివారం స్థానిక అటవీశాఖ రేంజర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులను ఆయన పరామర్శించారు. ఎఫ్ఆర్‌వో జయప్రసాదరావుతో మాట్లాడుతూ ఉచ్చులు వేసిన వేటగాళ్లను అరెస్టు చేయకపోగా, 8 గంటల పాటు బందీగా వున్న చిరుతను కాపాడటంలో అటవీశాఖ అధికారులు విఫలమయ్యారన్నారు. దీని తప్పుదోవ పట్టించేందుకు ఏడుగురు రైతులపై కేసులు పెట్టి చేతులు దులుపుకోవడం సరి కాదన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు. ఈ విషయమై జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళతా మన్నారు. రైతు కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపిన సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ పొన్నేటిపాళెం ప్రాంతంలో చిరుత సంచారంపై పది నెల లుగా గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారని, కాని అధికారులు నిర్లక్ష్యం చేశారన్నారు. తప్పు చేసిన అధికారులనే విచారణ అధికారులుగా నియమించడంతో దోషులు అవలీలగా తప్పించుకుం టార న్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి జంగాల శివరామ్, రైతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు

- ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న బాధితులు



జ్వరంతో ఇంటి వద్దే చికిత్స పొందుతున్న మహిళ, నాగేంద్ర

సిద్దవటం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జంగాలపల్లె గ్రామం ఎస్టీ కాలనీలో 15 రోజులుగా జ్వరాలు విజృంభించాయి. బాధితులు వైద్యం కోసం కడప, తిరుపతి, నెల్లూరు పట్టణాల ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు పెట్టుకుని వైద్యం చేసుకుంటున్నారు. గ్రామంలో మరికొంతమందికి విషజ్వరాలు విజృంభించి ఒళ్లు నొప్పులు, దగ్గు, తలనొప్పి బారిన పడి మంచానికి పరిమితమయ్యారు. అంగన్వాడీ కేంద్రం మంచినీటి ట్యాంకు వద్ద సైడ్ కాలువల్లో మురికినీరు నిల్వ ఉండడంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. దోమలు కుట్టడం వల్ల జ్వరాలబారిన పడ్డారు. ఇప్పటికైనా వైద్యసిబ్బంది గ్రామంలో పర్యటించి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించాలని పలువురు తెలియజేశారు. విష జ్వరాల విషయంపై కడప డీఎంహెచ్‌వో నాగరాజును వివరణ కోరగా జంగాలపల్లె ఎస్టీ కాలనీలో వైద్యసిబ్బందితో పర్యటించి ఇంటింటి సర్వే చేసి ప్రతి రోగి రక్తనమూనాలు సేకరించి మందులు పంపిణీ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి


రైల్వేకోడూరులో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి తెలిపారు. శనివారం రైల్వేకోడూరులో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం నిర్వహించి రోడ్లలో చెత్తచెదారాలను ఊడ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పొడిచెత్త, తడిచెత్తను వేర్వేరుగా పంచాయతీ సిబ్బంది వచ్చినప్పుడు వేయాలని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తాచెదారాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా ఉండాలన్నారు. చెత్తతో సంపదను సృష్టించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ నాగార్జునరావు, వెలుగు ఏపీఎం వసుంధర, వ్యవసాయశాఖ అధికారి జి.సుధాకర్, రైల్వేకోడూరు సర్పంచ్ బుడిగి శివయ్య, ఉపాధి ఏపీవో మృత్యుంజయరావు, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వరప్రసాద్‌రావు, కూటమి నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, పఠాన్ మౌలా, రాజ, మైనార్టీ నాయకులు జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మృతి




మృతి చెందిన ఆరీఫ్, గాయపడ్డ ముజాహిద్

లక్కిరెడ్డిపల్లె/చిన్నమండెం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంటపల్లికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ షేక్ ఆరీఫ్ (35) శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆరీఫ్ బంధువుల వివరాల మేరకు... ఆరీఫ్ తన మిత్రుడు చిన్నమండెంకు చెందిన ముజాహిద్‌తో కలిసి పనిమీద వ్యానులో మదనపల్లెకు బయలుదేరారు. తిరిగి వస్తూ మదనపల్లె-తిరుపతి రోడ్డు మార్గంలోని చిన్నతిప్పసముద్రం సమీపంలో ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను తప్పించబోయి వ్యాను చెట్టును ఢీకొంది. దీంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆరీఫ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ముజాహిద్ పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలించారు. కాగా ఆరీఫ్‌కు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు


పుల్లంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట పెట్రోల్ బంకు వద్ద శనివారం స్కూటరుపై వెళుతున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఓబులవారిపల్లె మండలం చిన్నంపల్లెకు చెందిన దాసాను గంగరాజు స్కూటర్‌పై పుల్లంపేటకు వెళుతుండగా పెట్రోల్ బంకు వద్దకు రాగానే వెనుకవైపు వస్తున్న లారీ స్కూటర్‌ను ఢీకొనడంతో గాయపడ్డాడు. పుల్లంపేట ఏఎస్ఐ పిచ్చయ్య సంఘటనాస్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని 108లో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడ్డ జయప్రకాశ్ నారాయణ

సిద్దవటం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలంలోని కనుమలోపల్లె వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒంటిమిట్ట మండలం కొండమాచుపల్లెకు చెందిన జయప్రకాశ్ నారాయణ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఏపీ04ఏఏ 7640 నంబరు గల ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఆవు అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. గాయపడ్డ వ్యక్తిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫి సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. జయప్రకాశ్‌నారాయణ కడప హెపీసీఎల్‌లో పనిచేస్తున్నారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి


శివకుమార్ (ఫైల్)

సుండుపల్లె, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో హోంగార్డు జి.శివకుమార్ (36) మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. సుండుపల్లె మండలం కోడూరువాండ్లపల్లికి చెందిన శివకుమార్ రాజంపేట సబ్ డివిజన్ పోలీసు అధికారి కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున సుండుపల్లెలోని తన ఇంట్లో మృతి చెందినట్లు తెలిపారు. శివకుమార్‌కు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. హోంగార్డు కుటుంబానికి అండగా ఉంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హామీ ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన కుటుంబానికి రూ.20 వేలు అందజేశారు.

సారా స్వాధీనం.. ఒకరి అరెస్టు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వైకోట అడవి ప్రాంతంలో జిల్లా సహాయ అబ్కారీ అధికారి జోగేంద్ర, కోడూరు ఎక్సైజ్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, అటవీ శాఖ అధికారులు, పోలీసులు శనివారం సంయుక్తంగా దాడులు నిర్వహించి సారాను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. 100 లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చేశారు. వైకోటకు చెందిన గంగయ్యను అదుపులోకి తీసుకొని 8 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

ప్రకృతి సాగు.. పసుపు బాగు

● ఎకరాకు 20.4 టన్నుల దిగుబడి

● కొనుగోలు చేసేందుకు తరలివస్తున్న దూరప్రాంతాల రైతులు



అధిక దిగుబడి వచ్చిన మైదుకూరు రకం పసుపు

చెన్నూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రసాయన రహిత వ్యవసాయమైన ప్రకృతిసేద్యంతో ఆ రైతు పసుపు సాగు చేశారు. తద్వారా ఎకరాకు 20.4 టన్నుల దిగుబడి వచ్చింది. దీంతో సాగు చేసిన రైతు సంతోషిస్తూ మరికొందరు రైతులకు మార్గదర్శకంగా మారారు. రసాయనిక రహిత పసుపు కావడంతో ధర కూడా మామూలు సాగు పసుపు కన్నా మూడు రెట్లు ఎక్కువగా ఉంది. రైతుకు ఆదాయంగా మారి ధర కూడా పెరగడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని కనుపర్తికి చెందిన రైతు దండుబోయిన బాలక్రిష్ణ పది నెలల కిందట బలసింగాయపల్లెలో రెండు ఎకరాల్లో పసుపు సాగు చేశారు. మైదుకూరు నుంచి తెచ్చిన పసుపు రకంతో పాటు అస్సాం నుంచి తెచ్చిన లాకడ్దాన్ రకం సాగు చేశారు. కొంతకాలంగా ఆంధ్ర, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాల్లో ప్రకృతి సేద్యంతో సాగవుతున్న పసుపు పంటతో పాటు పలురకాల పంటలు పరిశీలించారు. అక్కడ రైతులతో మాట్లాడి సాగు ఎలా చేపట్టాలో తెలుసుకుని అదే స్ఫూర్తితో బలసింగాయపల్లెలో పసుపు సాగు చేశారు. ఈ పంట బాగా పెరిగేందుకు మంచి దిగుబడి రావడానికి అక్కడి రైతులు చెప్పిన సలహాలతో పాటు పలు ప్రాచీన పద్ధతులు అవలంభించారు. రసాయనాలను పూర్తిగా పక్కన పెట్టేశారు.



పొలంలో పసుపు కొమ్ములు ఏరుతున్న కూలీలు

సాగు చేసిందిలా...

ప్రకృతి సేద్యంతో చేపట్టిన పసుపుసాగులో రాజస్థాన్ నుంచి పంట కోసం రాక్ ఫాస్ఫేట్ కొనడంతో పాటు కేరళ నుంచి స్పైసెస్ బోర్డు ద్వారా బ్యాక్టీరియా కల్చర్ కొనుగోలు చేశారు. అలాగే రాజస్థాన్‌లోని పత్తిమేడ గోశాల నుంచి 11 కిలోల దేశవాళీ నెయ్యిని తెప్పించి కానుగపిండి, వేపపిండి, ఆవాల పిండిని పంటలో వాడారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆవుపిడకలతో అక్షింతలు, సుగంధ ద్రవ్యాలు కలిపి అగ్నిహోత్రం చేశారు. వీటి వల్ల కొమ్ములు బాగా నాణ్యంగా బరువు పెరిగేందుకు ఉపయోగపడింది. అంతేకాక పదిరోజులు, 20 రోజులకు ఒక మారు ఘనజీవామృతాన్ని పిచికారి చేశారు. దీంతో పది నెలల్లో పంటను తవ్వడంతో 20.4 టన్నుల దిగుబడి వచ్చింది.

కొనేందుకు తరలివస్తున్న రైతులు

నాణ్యమైన పసుపు రసాయన రహితం కావడంతో ఈ పసుపుకు డిమాండ్ పెరిగింది. పసుపు కొమ్ములు చూసేందుకు కూడా ఎంతో బరువుగా నాణ్యతగా ఉన్నాయి. దీంతో సాధారణ రసాయనాలతో సాగు చేసిన పసుపు కిలో రూ.25 పలికితే రసాయన రహితమైన ఈ పసుపు పచ్చిదే కిలో రూ.90 వరకు ఉంది. అలాగే ఈ పసుపు ఎండబెట్టి పొడి చేస్తే కిలో రూ.400గా ఉంటుంది. లాకడాన్ పసుపు రకం పచ్చికొమ్ములే కిలో రూ.400 నుంచి 450, కొమ్ములు ఉడకబెట్టి ఆరబెట్టి పసుపు చేసి అమ్మితే కిలో రూ.4వేల వరకు ధర పలుకుతుంది.

అబ్బురపరిచే విషయం

రసాయన రహితంగా సాగు చేసిన పసుపుపై రుద్రాక్షమాల ఉంచితే సవ్యదిశలోనూ, రసాయనాలతో కూడిన పసుపుపై రుద్రాక్షమాల ఉంచితే అపసవ్య దిశలోనూ తిరుగుతుందని రైతు బాలచంద్ర చెబుతున్నారు. ఈ పసుపు చేతిలో పట్టుకున్నా, కొద్దిగా నోటి రుచి చూసినా దీని శక్తి ఏంటో, రైతులు పరిశీలించవచ్చని ఆయన వివరిస్తున్నారు.

పూర్ణరూపంలో పసుపు



ప్రస్తుతం సాగు చేసిన పసుపులో అన్ని రకాల పూర్వ దేశీయ పద్ధతులు వాడుతూ రసాయనాల మాటే లేకపోవడంతో ఎంతో నాణ్యతగా మంచి దిగుబడినిచ్చింది. ఈ కొమ్ములను పలువురు శాస్త్రవేత్తలు పరిశీలించారు. దీంతో పంచతత్వాలు పూర్ణరూపంగా ఉన్నాయని చెప్పారు. పైగా అస్సాం పసుపు పొడి అయితే కిలో రూ.400, లాకడాన్ పసుపు పొడి కిలో రూ.2వేలు ధర పలుకుతుంది. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి రైతులు తరలివస్తున్నారు. కేవలం కడప జిల్లా కాకుండా అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి రైతులు ఆన్‌లైన్ ద్వారా కొనుగోలుకు సిద్ధపడుతున్నారు. అలాగే బెంగుళూరు, హైదరాబాద్ నుంచి కొందరు రైతులు పసుపు కావాలంటూ అడుగుతున్నారు.

- డి.బాలక్రిష్ణ రైతు, కనుపర్తి

ఖాదర్‌పల్లెలో పోలీసుల నాకాబందీ



పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్

చాపాడు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలో శనివారం తెల్లవారుజామున పోలీసులు నాకాబందీ నిర్వహించారు. మైదుకూరు డివిజన్ డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ట్రైనింగ్ డీఎస్పీ భవానీ, మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, అర్బన్ సీఐ శ్రీహరి, బద్వేలు సీఐ రాజగోపాల్, ఎస్ఐలు చిన్నపెద్దయ్య, సత్యనారాయణ, హనుమంతు, చిరంజీవి, సుబ్బారావు, వినోద్‌కుమార్, రాజు, 150 మంది సివిల్ పోలీసులు, కడప స్పెషల్ పార్టీకి చెందిన 70 మంది పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఇంటింటిని తనిఖీ చేశారు. గ్రామస్థులతో మాట్లాడి ప్రశాంతంగా జీవించాలని చెప్పారు. ఈ తనిఖీల్లో రికార్డులు లేని నాలుగు ద్విచక్ర వాహనాలు దొరికినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య పేర్కొన్నారు. ఇటీవల ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన ముగ్గురు దొంగలను పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. బంగారు, డబ్బు దొంగతనం కేసులకు సంబంధించి వారిని పోలీసులు విచారిస్తున్నారు.

విద్యార్థిని చితకబాదిన కరస్పాండెంట్

● తల్లిదండ్రుల ఆగ్రహం



గాయాలపాలైన విద్యార్థి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థి ఆ పాఠశాలలోని ఫర్నీచరు, ఫ్యాన్‌ను ధ్వంసం చేసి నష్టపరిచాడనే నెపంతో కరస్పాండెంట్ చితకబాదిన ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా.. పోరుమామిళ్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని శనివారం ఆ పాఠశాలలోని ఫర్నీచర్, ఫ్యాన్‌ను ధ్వంసం చేశాడు. దీంతో కరస్పాండెంట్ ఆ విద్యార్థిని పిలిపించి వీపు విమానం మోత మోగించి గాయపర్చినట్లు తెలిసింది. ఆ విద్యార్థి ఎంత ప్రాధేయపడినా వినకుండా కర్రలతో కొట్టినట్లు చెబుతున్నారు. పైగా ఓ తెల్లకాగితంపై ఆ విద్యార్థి ఫ్యాను విరగ్గొట్టినట్లు రాయించుకున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు ఆ పాఠశాల కరస్పాండెంట్‌పై ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా, తమపై ఫిర్యాదు చేస్తే.. తమ పాఠశాల ఫర్నీచరు ధ్వంసం చేసినందుకు తాము కూడా విద్యార్థిపై ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించినట్లు సమాచారం. ఈ విషయం ఎక్కడైనా చెబితే టీసీ ఇచ్చి పంపుతామని బెదిరించినట్లు సమాచారం. దీంతో వారు చేసేదేమీ లేక వెనుదిరగాల్సి వచ్చింది. ఈ ఘటన పోరుమామిళ్లలో దావానంలా వ్యాపించింది.

48 హెక్టార్లలో అరటి నేలమట్టం

● రూ.1.80 కోట్ల నష్టం

లింగాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పెనుగాలులు వడగండ్ల వర్షానికి మండలంలోని వెలిదండ్ల, కర్ణపాపాయపల్లె గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వీచిన పెనుగాలులకు 48 హెక్టార్లలో అరటి పంటకు నష్టం వాటిల్లిందని పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. నష్టపోయిన రైతు వివరాలను సేకరించి నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. రైతులకు సుమారు రూ.1.80 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు.



అరటి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి శ్రీలేఖ

సింహాద్రిపురం: రెండు రోజులుగా (శుక్ర, శనివారం)లో వీచిన ఈదురు గాలులకు మండలంలోని పలు గ్రామాల్లో అరటి పంట నేలమట్టమైంది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులు పంట సాగుకు ఎకరానికి సుమారు రూ.2 లక్షలు వెచ్చించి పంటను పండించారు. తీరా డబ్బులు చేతికి వచ్చే సమయంలో ఇలాంటి విపత్కర పరి స్థితులు ఏర్పడటంతో రైతులు కోలుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడు తున్నారు. ఉద్యానవన శాఖాధికారుల అంచనాల మేరకు 60 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు మండల ఉద్యానశాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. అంకాళమ్మ గూడూరులో దెబ్బతిన్న అరటి తోటలను వీహెచ్ఏ శ్రీలేఖ పరిశీలించారు.

కాలుష్య రహితంగా కోర్టు పరిసరాలు

● ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన జడ్జి వెంకటేశ్వర్లు



పరిసరాలను శుభ్రపరుస్తున్న ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన జడ్జి వెంకటేశ్వర్లు

కడప రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టి ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా కోర్టు పరిసరాలను కాలుష్య రహితంగా తీర్చిదిద్దుతున్నామని ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన జడ్జి, మొదటి అనపు కోర్టు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిశుభ్రత ఉన్నచోటనే పరిశుభ్రమైన ఆరోగ్యం ఉంటుందని, వ్యర్థ పదార్థాలను ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్జిలు బాబాఫక్రుద్దీన్, కె.ప్రత్యూషకుమారి, ఆసిఫా సుల్తానా, జె.హేమస్రవంతి, కె.భార్గవి, జి.విజయలక్ష్మి, న్యాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ కేడర్ కల్పించాలి

● రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానిపాషా

కడపకలెక్టరేట్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ కేడర్ కల్పించి, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎండీ జానీపాషా డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఏపీ ఎన్జీవో సంఘ కార్యాలయంలో ఏపీ జేఏసీ సారథ్యంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే హీ రామియా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రవికుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ విద్యార్హతతో ఉద్యోగాలు సాధించిన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇప్పటివరకు రికార్డు అసిస్టెంట్ కేడర్, అంతకంటే తక్కువ కేడర్‌తో పేస్కేల్ అమలవుతోందన్నారు. దీన్ని జూనియర్ అసిస్టెంట్ కేడర్‌కు మార్పు చేసి ఈ పేస్కేల్ అమలు చేయడం ద్వారా సచివాలయ ఉద్యోగులకు సరైన గౌరవం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘ నేతలు కిరణ్‌కుమార్, నగర అధ్యక్షుడు చిన్నయ్య, కార్యదర్శి శైలేష్‌రెడ్డి, కోశాధికారి నాగార్జున, చిన్నమస్తాన్ సురేష్ బాబు, సుధాకర్, వీరయ్య పాల్గొన్నారు.

గోశాల అభివృద్ధికి సహకరిస్తా



మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, పక్కన ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్

దువ్వూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గోశాల అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె తెలుగుగంగ వద్ద ఉన్న ముక్తిదామ గోశాలను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎస్.వరదరాజులరెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ 300 గోవులను సంరక్షించడమంటే మాటలు కాదని నిర్వాహకులను ఆయన ప్రశంసించారు. తాను చిన్నప్పుడు చదువుకుంటూ గోవుల పెంపకానికి వెళ్లేవాడినని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. తమ తల్లి ఇప్పటికి 35 గోవుల ఆలనా పాలన చూస్తున్నారని చెప్పారు. గోశాల అభివృద్ధికి కలెక్టర్‌గా తనవంతు సహకరించాలని వరదరాజులరెడ్డి కోరారని, ఇక్కడికి వచ్చి చూసిన తర్వాత వారి కష్టం అర్థమవుతోందని తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ గోశాల నిర్వాహకుల కృషి ప్రశంసనీయమన్నారు. 25 ఎకరాల్లో గడ్డి పెంపకం జరుగుతోందని ఇంకా సౌకర్యాలు కల్పించాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే గోశాల అభివృద్ధికి రూ.50 లక్షలు ప్రతిపాదనలు పంపామని ఎమ్మెల్యే చెప్పారు. కలెక్టర్‌ను ఇక్కడకు రప్పించి వీటి సంరక్షణకు అవసరమైన విషయాలను తెలపాలనే కృషి ఫలించిందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ తాను టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఇక్కడ గోవుల సంరక్షణకు తనవంతు కృషి చేసి టీటీడీ నిధులు మంజూరు చేశానని చెప్పారు. గోశాల అభివృద్ధికి పాటుపడుతానని పేర్కొన్నారు. జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీతో పాటు పలువురు అధికారులు, నాయకులు, సమావేశంలో పాల్గొన్నారు.

అధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్



పోలీస్‌శాఖ సమీక్షలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడపరూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మే 10న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసుల పరిష్కారానికి ఉమ్మడి కడప జిల్లాలోని పోలీస్‌శాఖ తగు కృషి చేయాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవా సదన్‌లో పోలీస్‌శాఖ అధికారులతో ముందస్తు లోక్ అదాలత్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి పోలీస్‌స్టేషన్ల వారీగా కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం రాజీ పడే కేసులను గుర్తించి నేషనల్ మెగా లోక్ అదాలత్‌కు అధికంగా వచ్చేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో కడప, రాజంపేట అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసులు ప్రకాష్‌బాబు, మనోజ్ రామ్నాధ్ హెగ్డే, కడప, మైదుకూరు సబ్‌డివిజనల్ అధికారులు వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నగరంలో జరిగిన స్కామ్‌పై నిగ్గు తేల్చాలి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ ఆంజనేయులు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

కడపమారుతీనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ 5 ఏళ్ల పాలనలో ఆ పార్టీ నాయకుల కనుసన్నల్లో యథేచ్ఛగా దాదాపు వెయ్యి ఎకరాల భూమి కడప నగర పరిసర ప్రాంతాల్లో కబ్జాకు గురైందని, దాంతో పాటు జరిగిన సుమారు రూ.5 వేల కోట్ల స్కామ్‌పై నిగ్గు తేల్చాలని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ కె.ఆంజనేయులు ఆరోపించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నగర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అంతులేకుండా సాగిన అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, భూకబ్జాలను వెలికితీస్తామని మంత్రి నారా లోకేష్ బహిరంగంగా చెప్పిన సంగతి తెలిసిందే అన్నారు. ఆ కోవలో కడప నగరంలో కూడా ఆ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు సాగించిన భూ కబ్జాల దందా అంతా ఇంతా కాదని ఆరోపించారు. అదేవిధంగా కొందరు అధికారులు కడప నగరం పంచాయతీగా వున్నప్పటి నుంచి మున్సిపాల్టీ, కార్పొరేషన్‌గా మారినా ఇప్పటికీ వారు అక్కడే తిష్టవేసి మరీ విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. వారు అక్రమంగా సంపాదించిన ఆస్తులు ఆకాశమే హద్దు అన్నట్లుగా వున్నాయని విమర్శించారు. లేఔట్ల కోసంగా పురాతన కట్టడాలను కూడా కూల్చేశారన్నారు. నగర మాసాపేట స్కావెంజర్స్ కాలనీలో దళితుల ఇళ్లతో పాటు ఏకంగా అక్కడున్న గుడిని, అలాగే పురాతన దొరల గోరీలను ఉక్కాయపల్లె లేఔట్ కోసం కూల్చివేశారని ఆరోపించారు. ఇదిలా వుండగా గత 20 ఏళ్లుగా నగరంలో ప్రజలు చెల్లించే పన్నులు, కుళాయి పన్నులలో, లే ఔట్లలో అవినీతి తారాస్థాయికి చేరిందని, దీనిపై విచారించాలని డిమాండ్ చేశారు. కడపలో చేపట్టే టీడీపీ మహానాడు లోపలైనా కడపలో సాగిన భూకబ్జాల నిగ్గు తేల్చి దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో మహానాడులో నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలు పార్టీల, ప్రజాసంఘాల నాయకులు బి.హరిప్రసాద్, జయచంద్ర (టీడీపీ), సుబ్బారెడ్డి, జయకృష్ణ (కాంగ్రెస్), వై.ఎం.ప్రతాప్‌రెడ్డి (జనతాదళ్), దేవర శ్రీకృష్ణ (లోక్‌సత్తా), అవ్వారు మల్లికార్జున (జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ), ఓబయ్య (సీపీఐఎంఎల్), ప్రజాసంఘాల నాయకులు సీఆర్‌వీ ప్రసాద్, బీసీ గంగులు, నరసింహ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం


● దళితులకు ఇచ్చిన స్థలాలు ఆక్రమించారంటూ ఆవేదన

కమలాపురంరూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయం ఎదుట ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. మండలంలోని వై.కొత్తపల్లె వద్ద దళితులకు ఇచ్చిన ఇళ్లస్థలాలను అగ్రవర్ణానికి చెందిన ఓ సర్పంచ్ ఆక్రమించుకున్నారంటూ ఆవేదన చెంది దళిత యువకుడు నరసింహులు ఒంటిపై కిరోసిన్ పోసుకుని హల్‌చల్ చేశాడు. దీంతో అందరూ ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను ఆక్రమణ విషయంపై తహసీల్దారు శివరామిరెడ్డిని కలిసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించాడు. పలుమార్లు జిల్లా కలెక్టరేట్, కమలాపురం తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అర్హులైన వారికి ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరినా పట్టించుకోకపోవడంతో తాను ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డానని తెలిపాడు. ప్రభుత్వాలు మారుతున్నా దళితుల బాధలు పట్టించుకునే వారే లేరని వాపోయాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దళితులకు సంబంధించిన ఇళ్లస్థలాలను కబ్జాకు గురికాకుండా చూడాలని ఆయన కోరారు. కాగా పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



తహసీల్దారు కార్యాలయం వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకున్న యువకుడు

ఆర్టీసీ అధికారిపై విచారణ



కడప మారుతీనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప జోన్‌లో వీఎస్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ ఉన్నతాధికారిపై ఇటీవల వచ్చిన పలు అవినీతి ఆరోపణల విషయంగా విచారణ చేపట్టారు. ఆ మేరకు నెల్లూరు జోన్ ఆర్టీసీ విజిలెన్స్ అధికారి ధర్మతేజను విచారణ అధికారిగా ఆర్టీసీ రాష్ట్ర ఉన్నతాధికారులు నియమించారు. శనివారం స్థానిక ఆర్టీసీ ఏరియా ఆసుపత్రి ఆవరణంలో గల ఆర్టీసీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. కడప జోన్ వ్యాప్తంగా గల 40 మంది పోలీస్ కానిస్టేబుళ్లను గోప్యంగా విచారించారు. కాగా సేకరించిన సమాచారాన్ని ఆర్టీసీ రాష్ట్ర ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యే పరామర్శ



వల్లూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని గోటూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి కడప బాలాజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వెంకటసుబ్బయ్యను పరామర్శించారు. ఈసందర్భంగా స్థానిక డాక్టరు క్రిష్ణకిశోర్‌రెడ్డితో వెంకటసుబ్బయ్య ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వీరి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'మోదీ మళ్లీ రావడం ఆశ్చర్యంగా ఉంది'

వేంపల్లె, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల క్రితం ప్రధాని నరేంద్రమోదీ అమరావతి ప్రాంతంలోని ఉద్దండ రాయునిపాలెం వద్ద శంకుస్థాపన చేశారు. మళ్లీ మే 2న అదేపనికి శంకుస్థాపన చేసేందుకు వస్తుండడం ఆశ్చర్యంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో చేసిన పనికి మళ్లీ రావడం ఒకింత విస్మయానికి గురిచేస్తోందని తెలిపారు. పదేళ్లుగా ఎక్కడి పని అక్కడే ఉందని, రాష్ట్రానికి కేంద్రం కేవలం రూ.2500 కోట్లు మాత్రమే ఇచ్చారని, ప్రత్యేక హోదాను ఇవ్వకపోవడం శోచనీయమని తెలిపారు. భగవద్గీతకు అంతర్జాతీయంగా ఐక్యరాజ్య సమితికి చెందిన యునెస్కో మెమొరీ ఆఫ్ ద వరల్డ్ రిజిస్టర్‌లో చోటు దక్కడం మంచి పరిణామమని పేర్కొన్నారు.

టిప్పర్లు సీజ్

పెండ్లిమర్రి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువచెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇసుక, మట్టి, గ్రావెల్ లాంటివి ప్రభుత్వ అనుమతులు తీసుకొని తోలాలన్నారు.

ఈ-వ్యర్థాల్లో హానికర రసాయనాలు

వల్లూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శనివారం ఒక్కరోజు స్వచ్ఛత కోసం ప్రతి ఒక్క అధికారి పాటుపడాలని తహసీల్దారు శ్రీవాణి ఎంపీడీవో రఘురాం అన్నారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీవాణి నేతృత్వంలో కార్యాలయం లోపల, బయట పరిశుభ్రంగా ఉండేటట్లు సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. అలాగే ఎంపీడీవో మండల కేంద్రమైన వల్లూరులో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ సెంటరును సందర్శించారు. అనంతరం లేబాక గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగాస్థానిక విద్యార్థులు, ప్రజలతో కలిసి గ్రామంలో స్వచ్ఛత ర్యాలీని చేపట్టారు.ఈవోపీఆర్‌డీ కరీముల్లా, ఉప సర్పంచ్, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సూపర్‌వైజరు, ఎంపీ ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు, ఉపాధి సిబ్బంది, ఎమ్మార్పీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు..: పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తున్న ఈవేస్ట్‌ను తక్షణం తొలగించాలని ఈవోఆర్డీ సురేశ్‌బాబు అన్నారు. చెన్నూరులో ఈ-కలెక్షన్ సెంటరును శనివారం ప్రారంభించిన ఆయన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు కె.విజయ భాస్కర్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి చెన్నారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఏపీయం వెంకటేశ్, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పులివెందుల ఆహార విజ్ఞాన శాస్త్ర,సాంకేతిక కళాశాలలో ఈ-చెక్ కార్యక్రమంలో విద్యార్థులు

సీకేదిన్నె..: స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ-వ్యర్థాల సేకరణ చేపట్టడం జరిగిందని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, హరిత రాయబారులు తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్..: ఈ-వ్యర్థాల్లో హానికర రసాయనాలు ఉన్నాయని దీనికి అడ్డుకట్ట దిశగా ప్రభుత్వం ఈ-చెక్ అనే కార్యక్రమం ప్రవేశపెట్టింది. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా నెలలో ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఈ శనివారం ఈ-చెక్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో ఇ-చెక్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ ఈ-వ్యర్థాల సేకరణ,వాటిని సురక్షిత పద్ధతులలో రీసైక్లింగ్ చేయడం అనే అంశంపై మాట్లాడారు. కళాశాల పరిసరాల్లో బల్బులు, వైర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ జయమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని ఎర్రబల్లె పంచాయతీలోని నల్లపురెడ్డిపల్లెలో ఈ-చెక్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పులివెందుల టౌన్..: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ రాముడు అన్నారు. శనివారం పులివెందుల పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె వెంకట్రామిరెడ్డి, నాయకులు, కౌన్సిల ర్లు, అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీని పాత బస్టాండు వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కడప రూరల్..: స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎలెక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని జడ్పీ సీఈవో సి. ఓబులమ్మ తెలిపారు. శనివారం జడ్పీలో ఎలెక్ట్రానిక్ వ్యర్థాల సేకరణను చేపట్టారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో(డీపీఆర్‌సీలో) ఏవో బండపల్లి నాగభూషణం ఆధ్వర్యంలో అక్కడి అధికారులు సిబ్బంది ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ. పంచాయతీశాఖ, వ్యవసాయశాఖ, పశుసంవర్థకశాఖ, మార్కెటింగ్‌శాఖ, ఉద్యానశాఖ కార్యాలయాలలో ఉద్యోగులు, సిబ్బంది ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణను చేపట్టారు.

రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయండి

వేంపల్లె, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య డీలర్లను ఆదేశించారు. వేంపల్లెలోని చింతల మడుగుపల్లె, శ్రీరామ్‌నగర్ తదితర ప్రాంతాలలో రేషన్‌షాపులను తనిఖీ చేశారు. స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ లోకేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

సీకేదిన్నె, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీలు ఎస్సీ కార్పోరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. మండలంలోని ఎస్సీలకు 2025-26 సంవత్సరానికి యూనిట్ల ప్రాతిపదికన ఆర్థికచేయూత రుణాలు అందించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. మరిన్ని వివరాలకు ఎంపీడీవో , ఎస్సీ కార్పొరేషన్‌ను సంప్రదించాలన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

కడప క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రతి మూడోశనివారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించారు. ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య ఆధ్వర్యంలో ఏఆర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని జిల్లా పోలీసు కార్యాలయ పరిసరాలను పరిశుభ్రం చేయడంతో పాటు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు వీరేశ్, శివరాముడు, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో..: స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలోభాగంగా శనివారం నగరంలోని జిల్లా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు దారెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆర్.పురుషోత్తం రాజు పాల్గొన్నారు.

కడప క్రైం..: మొక్కలు నాటడం ప్రతి ఒక్కరీ బాధ్యత అని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ పిలుపునిచ్చారు. కడప నగరం ఎక్సైజ్ డిపో వద్ద శనివారం ఆయన ఎక్సైజ్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా 50 కిలోల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి సక్రమంగా తొలగించడం జరిగిందన్నారు. అలాగే కడప ఎక్సైజ్ శాఖ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం ఎక్సైజ్ డిపోలో నిర్వహించారు. ఏపీఎస్‌బీసీఎల్ వెంకటపతి, అసిస్టెంట్ ప్రొహిబిషన్,ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, ఎస్‌హెచ్‌వో క్రిష్ణకుమార్, ఈఎస్‌టీఎఫ్ ఇన్స్‌స్పెక్టరు విశ్వనాథరెడ్డి, ఇతర ఎక్సైజ్ సిబ్బంది, డిపో సిబ్బంది, హమాలీలు పాల్గొన్నారు.


ఎస్పీ కార్యాలయ ఆవరణంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

వికాస్ పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్


స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అక్కాయపల్లె వికాస్ (ఈఎం) హైస్కూల్లో ప్రతినెలా 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ హైస్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛభారత్ గొప్పదనాన్ని వివరించారు. మన పరిశుభ్రతే మన ఆరోగ్యమన్నారు. అనంతరం స్కూల్ ఆవరణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అరటి తోటలను పరిశీలించిన టీడీపీ నేతలు



వేముల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పెనుగాలులకు వేల్పుల గ్రామంలో శుక్రవారం దెబ్బతిన్న అరటితోటలను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డితో కలిసి తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి శనివారం పరిశీలించారు వారు మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామన్నారు. హెక్టార్‌కి రూ.35వేలు, మొక్కలు నాటుకోవడానికి కూడా పరిహారం అందిస్తామని రైతులు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నల్లచట్టాలతో దేశం సర్వనాశనం'


చెన్నూరు బస్టాండులో నిరసన తెలుపుతున్న ముస్లింలు

చెన్నూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నల్లచట్టాలు తీసుకుని వచ్చి దేశాన్ని మతాల వారీగా విడగొడుతోందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శనివారం మండలంలోని ముస్లింలు చెన్నూరులో ర్యాలీ నిర్వహించారు. బీజేపీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు ఇచ్చారు. అనంతరం పాతబస్టాండు కూడలిలో మైనార్టీ ప్రజలనుద్దేశించి ఆర్పీపీ అధ్యక్షుడు మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ, హోంశాఖమంత్రి అమిత్‌షాలు దేశంలో ముస్లింలకు వ్యతిరేకంగా నల్లచట్టాలు తీసుకువస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ముస్లిం నేతలు మాట్లాడుతూ బీజేపీకి పుట్టగతులు లేకుండా చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నేతలు హస్రత్, వారిష్, అన్వర్, షఫి, షబ్బీర్, రబ్, మంజూర్, గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

26న రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీ ఉదయం 10గంటలకు వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో జరిగే జనగణనలో కులగణన చేపట్టాలని నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీ.ఎం.ఓబులేసు యాదవ్ పిలుపునిచ్చారు.సలహాలు,సూచనలు, భవిష్యత్తు కార్యాచరణకై కడప ప్రెస్‌క్లబ్‌లో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశంలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ నాయకులు శ్రీనివాసులు,నవీన్, ఉదయ్, వేణు పాల్గొన్నారు.

నిప్పుతో ముప్పు తప్పదు

కడప క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నిప్పు పట్ల నిర్లక్ష్యంగా ఉంటే అది పెద్ద ముప్పుగా మారే అవకాశం ఉందని కడప ఫైర్ స్టేషన్ అధికారి బస్విరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పాత రిమ్స్‌లోని హోమియోపతి వైద్యశాలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోమియోపతివైద్యశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌సాంబమూర్తి, హోమియోపతి వైద్యశాల పర్యవేక్షకులు ఆనందరావు వైద్యులు పాల్గొన్నారు.

టీకాలకు అందరూ సహకరించాలి

సీకేదిన్నె, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి వైద్య సిబ్బందికి అందరు సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ నాగరాజు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొత్తపబ్బాపురం గ్రామంలో సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలివ్వాలి

వేంపల్లె, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యకార్మికులకు వెంటనే వేతనాలు ఇవ్వాలని వైసీపీ మండల కన్వీనర్ కల్లూరు చంద్ర ఓబుళరెడ్డి డిమాండ్ చేశారు.వేంపల్లె పంచాయతీ కార్యాలయం ఎదుట శనివారం వైసీపీ నాయకులు నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మునీర్‌బాష, కటిక చంద్ర శేఖర్, రవి శంకర్‌గౌడ్, మణిగోపాల్‌రెడ్డి, కురాకుల వెంకటేష్, భారతి, ముత్యాల ఆంజనేయులు పాల్గొన్నారు.

'వైసీపీ నిర్వాకం వల్లే ఈఓ సస్పెన్షన్'

వేంపల్లె, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీ వైసీపీ పాలక మండలి ఆధ్వర్యంలో నడుస్తోందని గతంలో వారి నిర్వాకం వల్ల ఉన్న నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా ఈఓపై ఒత్తిడి తెచ్చి తీసుకోవడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని, టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ కొత్త ఈఓను కలెక్టర్ నియమించారని, సోమవారం బాధ్యతలు స్వీకరించనున్న విషయం తెలుసుకొని వైసీపీనాయకులు ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. చౌకబారు రాజకీయాలు మానుకోవాలని హితవు చెప్పారు. టీడీపీ యువనాయకులు నామా వేమ కుమార్, మహమ్మద్, దక్కా రమేష్ పాల్గొన్నారు.

'వైసీపీ హయాంలోనే ముస్లింలకు ద్రోహం'

కడపకలెక్టరేట్,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనంతా బీజేపీ తొత్తుగా ఉంటూ ముస్లిం- మైనార్టీలకు తీరని ద్రోహం చేసిందని కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు హమీద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హమీద్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ముస్లిం మత గురువులపైనా దాడులు, కేసులుమరెన్నో అరాచకాలు చేశారన్నారు. అవన్నీ కప్పిపుచ్చు కోవడానికి టీడీపీతో కాంగ్రెస్ కుమ్మక్కయిందని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో జోహర్‌బాషా, దినకర్‌రెడ్డి, బాబ్జీ,కమాల్ బాషా పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ టెండర్ అక్రమాలపై విచారణ చేపట్టాలి


కడప మారుతీనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ప్రస్తుత 2025 సంవత్సరానికి సంబంధించిన ఎగ్జిబిషన్ టెండర్‌లో అక్రమాలు చోటుచేసుకున్నాయని, తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు జె. వెంకటసుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, కార్యదర్శి చాగలమర్రి ఓబులేసు, రాష్ట్ర నాయకులు బి. పవన్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు భారతీయ జనతాపార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

రహదారి భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలి

కడప క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రత పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని కడప ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు జావేద్ అన్నారు. శనివారం కడప నగరంలోని నారాయణ కాలేజీలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెల్ ఫోనులో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలను గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ టూర్

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్, కేజీబీవీ పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు సైన్స్ టూర్ ఏర్పాటుచేసినట్లు జిల్లా సైన్స్ అధికారి వి.ఎబినేజర్ తెలిపారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఉత్సుకత పెంపొందించడానికి గైడ్, ఉపాధ్యాయులు మరింతగా ఉత్సాహం నింపడానికి ప్రభుత్వం చర్య తీసుకొని ఏర్పాటుచేసిందన్నారు. జిల్లా నుంచి 300 మంది విద్యార్థులు 35 మంది టీచర్లు ఉప విద్యాశాఖాధికారి,జిల్లా సైన్స్ అధికారి సెక్టోరియల్ అధికారులు 7 బస్సులలో చెన్నై సైన్స్ ప్రదర్శన, పార్క్, మ్యూజియం, దక్షిణ చిత్ర, మహాబలిపురం సందర్శించారని తెలిపారు.



మారెమ్మతల్లికి ప్రత్యేక పూజలు



కడప కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నగర 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెలో వెలసిన మారెమ్మదేవత ఆలయ 21వ వార్షికోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 19, 20 తేదీలలో (శని, ఆదివారం) జాతర మహోత్సవాలు జరుగ నున్నాయి. అందులో భాగంగా శనివారం ఉదయం మారెమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యుడు ఆర్. జయరామిరెడ్డి పలువురు గ్రామప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు జాతర మహోత్సవం..: ఆదివారం గ్రామంలో జాతర మహోత్సవం జరుగనుంది. అనంతరం బండలాగుడు పోటీలు, సాయంత్రం కోలాటం జరుగనున్నట్లు తెలిపారు.

ప్రణాళిక పూర్తిచేయాలి : డీపీఎం

చక్రాయపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో పీఎండీఎస్, విత్తనగుళికలు క్యాంపింగ్ చేసి గ్రామస్థాయిలో డీఆర్‌డీఏ, ఆర్ఎస్‌కే సిబ్బంది సహకారంతో ప్రణాళిక పూర్తిచేయాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు, వ్యవసాయ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందితో ఖరీఫ్ యాక్షన్‌ప్లానింగ్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ మండల ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, డీఆర్‌డీఏ సిబ్బంది, ఎంటీ ప్రతాప్, వీఓఏలు, వీఏఏ, వీహెచ్ఏ, సీసీ, ఐసీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



బెదిరిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి


ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పెద్దముడియం మండలం కొండపాపాయపల్లె గ్రామంలో గ్రేజింగ్‌ల్యాండ్‌లో సోలార్‌కు సంబందించిన వారు భూమిని తీసుకుని ఆ గ్రామ రైతులను బెదిరిస్తున్నారని వారికి న్యాయం చేయాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీకి విన్నవించారు. ఆమేరకు ఆర్డీవో కార్యాలయంలో ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి రైతులతో కలిసి ఆర్డీవోకు వారొక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సర్వే నంబరు 224లో సుమారు 350 ఎకరాల గ్రేజింగ్ ల్యాండ్ ఉందన్నారు. పాపాయపల్లె గ్రామంలో గొర్రెలు, మేకలు, ఆవులు, బర్రెలు తదితర వాటికి మేత కోసం ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ సర్వే నంబరులో చుట్టుపక్కల గ్రామాల ప్రజల జీవనభృతికి ఆధారంగా నిలిచిందన్నారు. ఆ భూమి లేకపోతే ఆ ప్రాంతవాసులు జీవనం కష్టమన్నారు. సోలార్ పేరుతో గ్రేజింగ్ ల్యాండ్ తీసుకోవడం, ప్రజలకు ఇబ్బంది కలిగించడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే గ్రామంలోని ప్రజలను వారు బెదిరించడం, స్టేషన్ వరకు వెల్లడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే వెళ్లి పరిశీలించి పాపాయపల్లె గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని కోరారు

ఈ- వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు


ప్రొద్దుటూరులో ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్


బద్వేలులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి పెద్ద ముప్పు వాటిల్లుతుందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. శనివారం 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈ వేస్టు గురించి ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాన్ని మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఈ వేస్టును మున్సిపాలిటీకి అందజేయడం వలన రీసైకిల్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు గంగయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్‌బాషా, సుబ్బరాయుడు, మెప్మా టీఈ మహాలక్ష్మీ, సీవోలు విమల ,రసూలమ్మ టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేస్ట్ ఎలక్ట్రానిక్ వస్తువులు ఇవ్వండి

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటిలోని వేస్ట్ ఎలక్ట్రానిక్ వస్తువులు ఇచ్చి పర్యావరణాన్ని కాపాడాలంటూ అధికారులు నినాదాలు చేశారు. 'స్వచ్ఛఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంలో భాగం గా శనివారం మైదుకూరు మండల అభివృద్ధి కార్యాలయం నుంచి అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత గ్రంధాలయం భవనంలో ఈ వేస్ట్ ఎలక్ట్రానిక్స్ వస్తువుల సెంటర్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి, మెప్మా అధికారిణి కెజియా, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో: ఈవేస్ట్ నిర్వహణ సక్రమంగా చేయకపోతే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని కమిషనర్ శేషఫణి పేర్కొన్నారు. ఈ వేస్ట్ సేకరణ వాటి వినియోగంపై కమిషనర్ ప్రజలకు వివరించారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఎర్రగుంట్లలో నిర్వహించి ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో: స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని సోమిరెడ్డిపల్లె సచివాలయం-1లో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గృహాల్లో కాలం చెల్లిన ఎలక్ట్రానిక్ వస్తువులను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా వాటిని గ్రామ సచివాలయాలకు అందించాలని తెలిపారు. రేకలకుంట్ల గ్రామ పంచా యతీలో ఇన్‌ఛార్జ్ ఈవోపీఆర్‌డి సురేశ్ ఆధ్వర్యంలో ఈవేస్ట్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎంపీడీవో కార్యాల యంలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి, ఎంపీడీవో వెంగ మునిరెడ్డి ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బద్వేలు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీవో చంద్ర మోహన్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శ్రమదానం నిర్వహించి పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేలా కృషి చేస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి , ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛత సంకల్పంతో ముందుకెళ్లాలి

జమ్మలమడుగు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ స్వచ్ఛత సంకల్పంతో ముందుకెళ్లాలని జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి సూచించారు. శనివారం జమ్మలమడుగు పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అలాగే మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలు ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాశినాయనలో: పరసరాలను పరిశుభ్రంగా ఉంచుటకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీడీవో డాక్టర్ మైథిలీరెడ్డి పేర్కొన్నారు. శనివారం నర్సాపురంలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎలక్రికల్ వ్యర్థాలను ఎక్కబడితే అక్కడ పడేయరాదన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఖాజావలి,ఎంఈవో నిర్మల, ఎంపీటీసీ గౌషియా తదితరులు పాల్గొన్నారు.

చాపాడులో: మండల కేంద్రమైన చాపాడులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌పై అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో రవిశంకర్, ఈవోపీఆర్‌డీ క్రిష్ణవేణి, హెడ్మాస్టర్ మహ్మద్‌గౌస్, ఏవో రామానుజులు, గ్రామ సెక్రటరి శ్రీధర్‌బాబు, సీసీ సుబ్బరత్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే వెలిసిన ఆంజనేయ స్వామి విగ్రహం




మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక నంద్యాల రోడ్డులోని లక్షలు విలువ చేసే మున్సిపాలిటీ స్థలంలో శనివారం తెల్లవారే సరికే ఆంజనేయ స్వామి విగ్రహం వెలిసింది, అక్కడ పూజలు కూడా జరిగాయి. మున్సిపాలిటీ ఖాళీ స్థలాల్లో రూమ్‌లు కట్టి బాడుగలకు ఇస్తే మున్సిపాలిటీకి నెలకు లక్షల్లో ఆదాయం వస్తుంది. దీనిపై గతంలో మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌లో రెజల్యూషన్ కూడా పాస్ అయ్యింది. అధికారుల నిర్లక్ష్యం వలన పనులు జరుగకుండా అలానే ఉండిపోయింది. ఇప్పడు మున్సిపల్ స్థలాలలో రోజుకు ఒక చోట ఆక్రమణకు గురౌతున్నాయి. తాజాగా ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేయడంతో ఇక్కడ గుడి కడతారా? లేక విగ్రహం తీసివేస్తారా? అనే వేచిచూడాల్సిందే.

అధికారులకు శిక్షణ

బద్వేలు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఆర్డీవో చంద్రమోహన్ అధ్యక్షతన బూత్‌లెవెల్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అట్లూరు, బద్వేలు, బి.కోడూరు, గోపవరం మండలాలకు సంబంధించిన బూత్ లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లకు ఎన్నికల విధులకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. తహశీల్దారు ఉదయభాస్కర్‌రాజు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

చెన్నారెడ్డిపల్లె గ్రామ దేవరకు రూ.2లక్షలు విరాళం

ముద్దనూరు ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):మండలంలోని చెన్నారెడ్డిపల్లె లో నిర్వహించే పెద్దమ్మతల్లి దేవరకు మండల బీజేపీ నాయకుడు డాక్టర్ మధుసూదనరెడ్డి రూ.2 లక్షలు విరాళాన్ని అందజేశారు.శనివారం దేవర కార్యక్రమం నిర్వాహకులకు నగదును ఎంపీటీసీ లక్ష్మీకాంతమ్మ ఆధ్వర్యంలో అందించారు .ఆదివారం దేవర ఘనంగా నిర్వహించనున్నారు. 12 ఏళ్ల తరువాత దేవర నిర్వహిస్తుండటంతో వైభవంగా కార్యక్రమాలు చేస్తున్నారు. చెన్నారెడ్డిపల్లె గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ బీద రవీంద్రకు ఘన సన్మానం


ఎమ్మెల్సీ బీద రవీంద్రను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ బీద రవీంద్ర యాదవ్ ను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక టీడీపీ కార్యాలయంకు ఎమ్మెల్సీ బీద రవీంద్రయాదవ్ పోలిట్ బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసులరెడ్డితో కలిసి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా, నియోజకవర్గం రాజకీయాలపై వారు చర్చించారు. ఎమ్మెల్సీ బీద రవీంద్రను సన్మానించిన వారిలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి , బీసీ నాయకుడు చల్లా రాజగోపాల్ యాదవ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పిద్దాం


పోరుమామిళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.చెన్నయ్య పేర్కొన్నారు. శనివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చదివించాలని కోరుతూ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిలరు ఖాజానాయబ్‌రసూల్; మండల ఉపాధ్యక్షురాలు ఆదిత్యలక్ష్మి. ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల్లో కొత్త చట్టాలు అమలు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనల్లో కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు అన్నారు. శనివారం పోరుమామిళ్లలో ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు హెల్మెట్లు ధరించాలని, త్రిబుల్ రైడింగ్ చేయరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. పట్టుబడితే గతంలోవంద ఉన్న జరిమానా కొత్త చట్టం ప్రకారం వెయ్యి రూపాయలకు పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ దుర్గా మోహన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు ఎస్సీలు దరఖాస్తు చేసుకోండి

కాశినాయన ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలో ఉన్న ఎస్సీలు ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో డాక్టర్ మైథిలీరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మండలానికి 30 యూనిట్లు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం మొదలైందని మే నెల 10వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉంటుందన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులైన యువకులు చేపల, వానపాముల పెంపకము, బేకరి, ఆర్వోప్లాంట్, దుకాణాలు వంటి వాటి ఏర్పాటుకు అప్లైచేసుకోవచ్చన్నారు.లబ్ధిదారుడు 21సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఎస్సీకుల ధృవీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు.





జలగ రోగంతోనే మేకలు, గొర్రెలు మృత్యువాత


మేకలకు వైద్యమందిస్తున్న వైద్యాధికారులు

బి.కోడూరు, ఏప్రిల్ 19 (ఆంధ్ర జ్యోతి): మండలంలో మేకలు, గొర్రెలు జలగ రోగంతో చనిపోతున్నాయని పశువైద్యాధికారులు వెల్లడించారు. ఇటీవల మేకలు, గొర్రెలు మెడవాపు, పొట్ట ఉబ్బరంతో చని పోతున్నాయని 'ఆంధ్రజ్యోతి'లో శని వారకం 'మూగరోదన.. రైతు ఆక్రం దన' అనే శీర్షికన వార్తా కథనం ప్రచు రిత మైంది. ఇందుకు స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు బ్రహ్మంగారిమఠం డివిజన్ ఏడీఏ వెంకటసుబ్బయ్య, స్థానిక పశువైద్యాధికారి భరద్వాజక్రిష్ణతో కలిసి రెడ్డివారిపల్లె గ్రామానికి వచ్చి శనివారం వైద్య శిబిరం నిర్వహించి మేకలను, గొర్రెలను పరిశీలించారు. చనిపోతున్న మేకలు, గొర్రెలకు జలగ రోగం సంభవించిందని, దీనికి వైద్యం అందిస్తా మని, రైతులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. అలాగే మేకలు, రైతుల గొర్రెలకు మేపు, తాగునీటిపై అవగాహన కల్పిస్తూ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. సోమవా రం కూడా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తు న్నట్లు వారు తెలిపారు. ఈ సీజన్‌లో ఈ జబ్బు రాకూడదని, కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల శ రీరంలో జలగల ఉత్పత్తి పెరిగి దీంతో చనిపోతున్నాయని, సరైన వైద్యం అందిస్తామని వారు తెలిపారు.

ఆక్రమిత భూములు పరిశీలించిన అధికారులు

దువ్వూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం నీలాపురం, దాసరిపల్లె గుట్ట ప్రాంతాల్లో ఆక్రమిత భూములను రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలిం చారు. ఇందులో భాగంగా దువ్వూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల తహసీల్దార్లు అక్బల్‌బాష, శ్రీనివాసులరెడ్డి, శోభన్‌బాబు సాగులో ఉన్న పంటల వద్దకు వెళ్లి పరిశీలించారు. సదరు భూముల విస్తీర్ణం ఎంత, సాగుదారుల పేర్లు, ఇతరత్రా వివరాలు సేకరించాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ వారికి సూచించారు. అంతకుముందు ఆర్డీవో స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

బాదుల్లా కుటుంబానికి సాయమందేలా కృషి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) :గొడుగు బాదుల్లా కుటుంబానికి ఆర్థికసాయం అందించేందుకు కృషి చేస్తామని ఆ కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొంది కుడికాలు కోల్పోయిన పుల్లీడుకు చెందిన గొడుగు బాదుల్లాను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, రమణారెడ్డి, నాగార్జునరెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే కాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ఉత్సాహంగా సాగిన రన్‌ఫర్ జీసెస్

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని రామేశ్వరం నుంచి రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. శనివారం ప్రొద్దుటూరు ఐక్య క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. రామేశ్వరం మోరీల వద్ద ప్రారంభమైన ర్యాలీ మైదుకూరు రోడ్డులోని ఎస్పీజీ-1 చర్చి వరకు కొనసాగింది. యేసుక్రీస్తు పునరుత్థానం వేడుకలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని వివిధ చర్చిల పాస్టర్లు, సంఘ పెద్దలు క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక మహిళా శక్తిభవన్‌లో బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణ సెంటర్‌ను నంద్యాల కొండారెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ మహిళలకు మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్లను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పుష్పాలంకరణ

బద్వేలు రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి భక్తిశ్రద్ధలతో పుష్పాలంకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

యువతి అదృశ్యం

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేకలబాలాయపల్లెకు చెందిన వన్నూరమ్మ(19) అనే యువతి అదృశ్యమైనట్లు కలమల్ల పోలీసులు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లిపోయినట్లు యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామన్నారు.





రైతులు భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలి

కొండాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఏవీరామాంజలులరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని రైతుసేవాకేంద్రం ఇన్‌ఛార్జ్‌లతో స్థానిక రైతుసేవాకేంద్రంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా తమ భూమిలో ఎంతమేర పోషకాలు ఉన్నాయో రైతులు తెలసుకోవచ్చన్నారు. 2024-25 సంవత్సరానికి రబీ సీజన్‌లో జొన్నపంట సాగుచేసి ఈ-పంటలో నమోదు చేసు కున్న రైతులకు ప్రభుత్వం మద్దతుధర ప్రకటించిందన్నారు. జొన్నపంటను క్వింటాల్‌కు రూ.3371 ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, అమ్మదలచిన రైతులు రైతుసేవాకేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు.

అగ్నిప్రమాదాలపై క్షేత్రస్థాయిలో అవగాహన

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : అగ్నిప్రమాదాలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా అగ్నిమాపక వారోత్సవాలు జరుపుతున్నామని ప్రొద్దుటూరు అగ్నిమాపక అధికారి రఘునాథ్ తెలిపారు. శనివారం స్థానిక ప్రైవేటు ఆసుపత్రులలో జరిగే అగ్నిప్రమాదాల పై ఫైర్ అధికారులు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా గ్యాస్ సిలిండర్‌లు లీక్ అయ్యి మంటలు వ్యాపిస్తే వాటిని ఎలా అరికట్టాలో అవగాహన కల్పించారు. ఆసుపత్రి వైద్యులు ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

10న జాతీయ లోక్ అదాలత్

జమ్మలమడుగు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో మే 10వ తేదీన జాతీయలోక్ అదాలత్ ఉంటుందని జడ్జి భార్గవి తెలిపారు. శనివారం జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో పోలీసు అధికారులకు, న్యాయవాదులకు జడ్జి అధ్యక్షతన సమావేశం జరిగింది. కక్షిదారులు ఎలాంటి సమస్యలు లేకుండా రాజీ ప్రయత్నంలో కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరి మురళీధర్‌రెడ్డి, న్యాయవాదులు , పోలీసు అధికారులు పాల్గొన్నారు.

